క్లుప్తంగా

రేషన్‌షాప్‌పై 6-ఏ కేసు



సంతనూతలపాడు: పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు అక్రమార్కులకు ఆదాయ వనరుగా మారుతోంది. గురువారం స్థానిక రజకవాడలో ఉన్న రేషన్ షాపు-3కు సంబంధించి డీలర్ ఎస్. శ్రీనివాసరావు రేషన్ దుకాణంలో రికార్డుల కన్నా అధికంగా స్టాకు ఉండటంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బీ రాజ్యలక్ష్మి 6-ఏ కేసు నమోదు చేశారు. రికార్డుల కన్నా అధికంగా 270 కిలోల బియ్యం, 144 కిలోల జొన్నలు అధికంగా ఉన్నట్లు డీటీ పేర్కొన్నారు. దీనికి సంబంధించి డీలర్ కేసు నమోదు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఫిర్యాదు మేరకు డీలర్‌పై అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ గుణ వంశీ, వీఆర్వో దాసరి శ్రీనివాసులు పాల్గొన్నారు.

16న కర్నూలులో నరసం సదస్సు

ఒంగోలు మెట్రో: నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం)7వ వార్షికోత్సవ సదస్సులు ఈనెల 16న కర్నూలులో జరగనున్నాయని నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమం కర్నూలులోని టీజీవీ కళాక్షేత్రంలో భారీస్థాయిలో నరసం రాష్ట్ర సహాయ కార్యదర్శి డాక్టర్ దండేబోయిన పార్వతి, స్థానిక కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. నరసం కర్నూలు జిల్లా అధ్యక్షురాలు సుబ్బలక్ష్మి సభాధ్యక్షురాలిగా, సభను మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు. కావునా రచయిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె ప్రకటనలో కోరారు.

జాగ్రత్తలతో కుష్టు వ్యాధి నివారణ



కొత్తపట్నం: ముందు జాగ్రత్తలు తీసుకుంటే కుష్టు వ్యాధి నివారణ సాధ్యమవుతుందని డీపీఎంవో పి.దేవకుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మోటుమాల కేజీబీవీని ఆయన సందర్శించి విద్యార్థులకు స్పర్శ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు మెడికల్ సిబ్బందితో స్పర్శ ప్రోగ్రాంపై అవగాహన సమావేశాలు నిర్వహించారన్నారు. ప్రతి విద్యార్థి స్పర్శపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమిక దశలో ఉంటే వెంటనే నయం చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కొత్తపట్నం పీహెచ్ డాక్టర్ వైష్ణవి, డీపీఎంవో శ్రీనివాసరెడ్డి, సీహెచ్‌వో ఓంకార్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అరుణ్‌కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ అమరుల్లా, ఎంపీహెచ్‌ఏ కృష్ణవేణి, సూపర్ వైజర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో ఉపయోగాలు

సంతనూతలపాడు: గృహాల్లో వాడుకుంటున్న నీరు రహదారి వెంట వెళ్లకుండా, మరో పక్క పారిశుద్ధ్యానికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు సంతనూతలపాడు ఎంపీడీవో డీ సురేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గురువారెడ్డిపాలెం, రుద్రవరం, మైనంపాడు, లక్ష్మీపురం, ఎండ్లూరు, గుడిపాడు, కొనగానివారిపాలెం, చిలకపాడు, చంద్రపాలెం గ్రామాల్లో 295 ఇంకుడు గుంతలకు అనుమతులు వచ్చాయన్నారు. ఈనెల 15న ఆయా గ్రామాల్లో పనులను గుర్తించాలని ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆయన ఆదేశించారు.

ఘనంగా జాతీయ మహిళా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ఒంగోలు సిటీ: సరోజినీ నాయుడు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ డీ కళ్యాణి పేర్కొన్నారు. గురువారం జాతీయ మహిళా దినోత్సవాన్ని డీఎస్ ప్రభుత్వ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల శాఖ, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఆంగ్ల రచయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలైన సరోజినీ నాయుడు జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ఆమె సాగించి పోరాటం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఆంగ్ల శాఖాధిపతి సుధారాణి సరోజినీ నాయుడు విద్యలోను, కవిత్వ రచనలోనూ ఎలా అభివృద్ధి సాధించారో వివరించారు. శ్రీనాగశ్రీజ విద్యార్థిని సరోజినీ గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించింది. కార్యక్రమంలో అధ్యాపకురాలు ఏవీ రాజ్యలక్ష్మీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ ఇందిరా, సంచాలకులు పి. కుసుమకుమారి, డాక్టర్ ఎం శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

భృతి రాక.. భుక్తి లేక !

మీ ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి తల్లికి వందనం.. ఎంతమంది నిరుద్యోగులు ఉంటే అంతమందికి నిరుద్యోగ భృతి.. అది కూడా ఉద్యోగం వచ్చేంత వరకు ఇస్తాం. ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం.. ఇక ఉద్యోగాల పండగే అంటూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలివి. తీరా చూస్తే అధికారంలోకి వచ్చాక 'డబ్బుల్లేవు.. చూస్తే భయం వస్తోంది.. డబ్బులున్నప్పుడు పథకాలు అమలు చేస్తాం' అని కూటమి సీఎం చంద్రబాబు పలికిన మునలికన్నీరు మాటలివి.. అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా.. ఇంతవరకు నిరుద్యోగ భృతిపై ప్రకటన చేయకపోవడంతో నిరుద్యోగులు ఆగ్రహం తో ఉన్నారు..

- జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిపై నిరుద్యోగుల గంపెడాశలు
- ఉద్యోగం వచ్చేంత వరకు రూ.3 వేలు ఇస్తామని చంద్రబాబు హామీ
- సంతనూతలపాడు నియోజకవర్గంలో 15 వేల మంది నిరుద్యోగుల ఎదురుచూపులు



చీమకుర్తి రూరల్: సీఎం చంద్రబాబు పేరు చెప్తే చాలు.. అబద్ధాల పుట్ట అని ప్రతి ఒక్కరూ చెప్తారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు చేస్తారా అని నిరుద్యోగులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రచార సమయంలో ఏటా జాబ్ క్యాలెండర్ ఇవ్వడంతో పాటు ఉద్యోగం వచ్చేంత వరకు నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తానని చంద్రబాబు నిరుద్యోగులను ఊదరగొట్టారు. వారు అనుకున్నట్లే అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా ఇంతవరకు నిరుద్యోగులకు ఇస్తానన్న హామీలు ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిరుద్యోగులను ఆదుకున్న మాజీ సీఎం జగన్..

సంతనూతపాడు నియోజవర్గంలో దాదాపుగా 15 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. 2014 ఎన్నికల సమయంలోనూ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం.. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు చెప్పారు. జాబ్ రావాలంటే.. బాబు రావాలని ప్రచారం హోరెత్తించారు. నమ్మిన జనం ఓట్లు వేసి గెలిపించారు. అప్పట్లో కూడా వారు అనుకున్నట్లే గెలిచారు కానీ హామీలు అమలు మాత్రం అటకెక్కించారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకపోగా చివరి ఏడాదిలో రెండు నెలలు మాత్రమే కొంతమందికి నిరుద్యోగ భృతి ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు. ఇప్పుడు కూడా అప్పట్లో లాగే మోసమే చేస్తారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఏర్పాటు చేసి మరీ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చింది. ప్రస్తుతం సంతనూతలపాడు నియోజకవర్గంలోని 15 వేల మంది నిరుద్యోగులు కూటమి ప్రభుత్వం ఎప్పుడు హామీలు అమలు చేస్తుందా అని ఎదురుచూపు చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో నిరుద్యోగుల్లో ఆందోళన నెలకొంది. అదిగో డీఎస్సీ, ఇదుగో డీఎస్సీ అంటూ ప్రకటనలు ఇస్తూ నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. చిన్నచితకా ఉద్యోగులు చేస్తున్న నిరుద్యోగులు జాబ్ మానేసి మరీ డీఎస్సీ కోసం ప్రిపేర్ అవుతున్నారు. తీరా నోటిఫికేషన్ రాకపోవడంతో కుటుంబం గడవకపోవడంతో దిక్కుతోచని స్థితిలో నిరుద్యోగులు ఉన్నారు.

ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు



కూటమి ప్రభుత్వం గత సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని వాగ్దానాలు చేశారు. ఇప్పటి వరకు అమలు చేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా నిరుద్యోగులను గుర్తించి వారికి జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– మోపూరి సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు, చీమకుర్తి

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి..



సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలి. ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారా అని నిరుద్యోగులంతా వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాం. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడం బాధాకరం.

– జీ వెంకట సుబ్రమణ్యం, బీఎస్సీ కంప్యూటర్, ఇలపావులూరు

నిరుద్యోగ భృతి వెంటనే ఇవ్వాలి..



నిరుద్యోగ భృతి వెంటనే ఇచ్చి ఆదుకోవాలి. ఉద్యోగాలు భర్తీ చేసేంత వరకు ప్రిపరేషన్ కోసం నిరుద్యోగ భృతి ఉపయోగపడుతుంది. ఎప్పటికీ నిరుద్యోగులుగా మిగిలిపోకుండా చర్యలు చేపట్టాలి. ఇప్పటికైనా హామీలు నెరవేర్చాలి. ఇప్పటివరకు ఏ ఒక్క హామీ అమలు చేయక పోవడం బాధాకరం.

– పులి వేంకటేశ్వర్లు, ఎంబీఏ ఫైనాన్స్, ఇలపావులూరు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కోర్ డీన్ మధుసూదన్‌రెడ్డి

ఒంగోలు సిటీ: దేశ వ్యాప్తంగా జరిగిన జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఒంగోలు నారాయణ విద్యా సంస్థల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించినట్లు జిల్లా నారాయణ విద్యా సంస్థల కోర్ డీన్ ఆర్ మధుసూదన్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీగౌతమ్ 97.61, సీ మోనీష్ 93.68, సీహెచ్ వేణుగోపాల్ 92.78, బీ సాకేత్ 91.54, వీ నాగశ్రీ సంజన 91.39 పర్సంటైల్ సాధించినట్లు పేర్కొన్నారు. అనంతరం పర్సంటైల్ సాధించిన విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం మురళి, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చీమకుర్తి: గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షలో పాల్గొనేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చీమకుర్తి గురుకుల బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఫ్లారెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ నెల 6న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలను సందర్శించి వివరాలు తెలుసుకోవాలని ప్రకటనలో కోరారు.

నూరుశాతం ఫలితాలు రాబట్టండి

- డీఈఓ కిరణ్‌కుమార్



చీమకుర్తిలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ

చీమకుర్తి: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు రాబట్టాలని డీఈఓ ఏ కిరణ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గోనుగుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా బాలికల ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థినులతో మాట్లాడి రానున్న పదో తరగతి పరీక్షల్లో వారి విద్యాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం కూడా గత ఏడాది కంటే ఎక్కువ శ్రద్ధ వహించే విధంగా ఉపాధ్యాయులను సమన్వయం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, క్రీడలు, ఇతర సాంస్కృతిక విభాగాల్లో విద్యార్థులు ప్రదర్శించిన నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. గోనుగుంట జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత బాగుందని ప్రశంసించారు. కార్యక్రమాలలో ఎంఈఓ-1, 2 నరసింహారావు, కె.శివాజీ, ప్రధానోపాధ్యాయులు జి.వీరాస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లల పండుగను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బాలోత్సవ కమిటీ నాయకులు

ఒంగోలు సిటీ: అందరం కలిసి పిల్లల పండుగను విజయవంతం చేయాలని బాలోత్సవం అధ్యక్షుడు బండారు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం ఎల్బీజీ భవనంలో బాలోత్సవం కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీన ఒంగోలు పీవీఆర్ బాలుర పాఠశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అమరావతి బాలోత్సవం కార్యదర్శి రామరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పిల్లల అభివృద్ధి కోరుకునే వారందరూ కలసి ఈ బాలోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు మేయర్ హాజరవుతున్నట్లు తెలిపారు. బాలోత్సవం ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసరావు మాట్లాడుతూ 300 మంది టీచర్లు, 100 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వచ్ఛందంగా పనిచేయడానికి ముందుకు వచ్చారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వినోద్, బాబు, జయప్రకాశ్ పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో ఆర్థిక పరిపుష్టి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ డేవిడ్

నాగులుప్పలపాడు: సమీకృత వ్యవసాయ క్లస్టర్ ద్వారా మహిళా రైతు కుటుంబాలకు జీవనోపాధి కల్పించి ఆర్థిక పరిపుష్టి చెందేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని డీఆర్డీఏ వెలుగు ప్రాజెక్టు మేనేజర్ డేవిడ్ పేర్కొన్నారు. గురువారం నాగులుప్పలపాడులోని వెలుగు కార్యాలయంలో సమీకృత వ్యవసాయ క్లస్టర్లపై అవగాహన కార్యక్రమం ఏపీఎం నరేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ క్లస్టర్ కింద నాగులుప్పలపాడు, అమ్మనబ్రోలు గ్రామాలను ఎంపిక చేశామన్నారు. ఆయా గ్రామాల్లో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా మహిళా రైతులకు కనీసం ఐదుగురికి తగ్గకుండా జీవనోపాధి కల్పించడమే ఈక్లస్టర్ ఉద్దేశమన్నారు. ప్రస్తుతం 300 కుటుంబాల్లో ఈ మిషన్ పనిచేస్తున్నారని, ప్రతి 100 కుటుంబాలకు క్లస్టర్ రిసోర్స్ పర్సన్ నియమించామని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యశాల ఏడీ నాగభూషణంవ్యవసాయాధికారి వెంకట్రావు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నేడు దామోదరం సంజీవయ్య జయంతి

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 105వ జయంతి వేడుకలను ఈ నెల 14వ తేదీ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆ శాఖ సంచాలకులు ఎస్.లక్ష్మానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ ఎదురుగా ఉన్న సంజీవయ్య విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. మంత్రులు, కలెక్టర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు. జు

యాజమాన్య పద్ధతులతో దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న జీపీఐ ప్రతినిధి ఆన్ సల్మా

మద్దిపాడు: యాజమాన్య పద్ధతులకు మెరుగైన నైపుణ్యాన్ని జోడించి పొగాకు దిగుబడి పెరిగేందుకు జీపీఐ తమవంతు కృషి చేస్తుందని ఇండోనేషియా జీపీఐ ప్రతినిధి ఆన్ సల్మా తెలిపారు. గురువారం గుండ్లాపల్లిలో పొగాకు రైతు పల్లకి సత్యనారాయణ రెడ్డి బ్యారన్ వద్ద పొగాకు రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి కంపెనీ సీనియర్ మేనేజర్ పునీత్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఇండోనేషియా ప్రతినిధి ఆన్ సల్మా మాట్లాడుతూ పొగాకు నాణ్యతనుబట్టి గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. జీపీఐ నుంచి రైతులకు అవసరమైన యంత్ర సామగ్రితో పాటు టార్పాలిన్ పట్టలు, మాస్కులు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మేనేజర్ శ్యామల, రామ సుబ్బారెడ్డి పల్లకి రామచంద్రారెడ్డి, చావా శ్రీనివాసరావు తేళ్ల వెంకట సుబ్బారావు, కంచర్ల శ్రీను, సుజాత, అనురాధ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల దీక్షలు

ఒంగోలు సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు మూడో రోజు కొనసాగాయి. ఒంగోలు కార్పొరేషన్‌లో మున్సిపల్ కార్మికులు రిలే దీక్షలు కొనసాగించారు. ఈసందర్భంగా సీఐటీయూ నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, ఆప్కాస్‌లో పని చేస్తున్న కార్మికులు స్థానిక, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తూ కాంట్రాక్టులు రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలకు జేబులు నింపే విధానాన్ని అవలంభిస్తున్నారని విమర్శించారు.

సరైన చికిత్స అందించాల్సిన బాధ్యత మీదే



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరావు

అల్లూరు (కొత్తపట్నం): రోగులకు సరైన చికిత్స అందించి వారిపట్ల బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని అల్లూరు గ్రామంలో ఉన్న వెల్‌నెస్ సెంటర్-1, 2లను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన సెంటర్లలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపీలు ఎన్ని వస్తున్నాయి.. ? ఎన్ని రకాల పరీక్షలు చేస్తున్నారు ? ఏరోజు డేటా ఆ రోజు అప్‌లోడ్ చేస్తున్నారా లేదా ? అని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్లకు ఇచ్చిన అన్ని రకాల పరీక్షలను తప్పనిసరిగా చేయాలన్నారు. రోగులకు అందుబాటులో ఉండి బాధ్యతగా పనిచేయాలన్నారు. సెంటర్లలో ఎప్పటికప్పుడు సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పోగ్రామ్ అధికారి వాణిశ్రీ, కొత్తపట్నం పీహెచ్ సెంటర్ డాక్టర్ వైష్ణవి, సీహెచ్‌వో ఓంకార్, సూపర్‌వైజర్ ప్రభాకర్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీలు బత్తుల భారతి, శ్రీనాంథ్, ఏఎన్ఎంలు ప్రియాంక, సుభాషిణి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ డీవీఆర్ మూర్తి

ఒంగోలు సిటీ: ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తి పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో గురువారం ఒంగోలులోని ఆంధ్రకేసరి యూనివర్సిటీలో రహదారి భద్రతపై విద్యార్థులు, యూనివర్సిటీ సిబ్బంది, వాహనాల డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సభకు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వైస్ చాన్సలర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. లైసెన్స్, హెల్మెట్, సీట్‌బెల్ట్, సరైన ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ఎన్ఎస్ఈ సమన్వయకర్త డాక్టర్ మండే హర్షప్రీతం దేవ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్ నిర్మలామణి, సీడీసీ డీన్ సోమశేఖర్, సిబ్బంది, యూనివర్సిటీ వాహనాల డ్రైవర్లు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును అడ్డుకోండి



నిరసన తెలుపుతున్న ముస్లిం సంఘాల నాయకులు

ఒంగోలు సిటీ: శీతాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాకముందే వక్ఫ్ సవరణ బిల్లును పార్లమెంటులో చర్చకు పెట్టడాన్ని ఎస్‌డీపీఐ పార్టీ రాష్ట్ర నాయకుడు అబ్దుల్ సత్తార్ తప్పు పట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వక్ఫ్ నిరసన కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రార్థనల అనంతరం బిలాల్ నగర్ సర్కిల్ వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సత్తార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం ముస్లింలపై పగపట్టిందని, పార్లమెంటులో మెజార్టీ లేనందున కుట్రపూరితంగా సమావేశాలు మొదలు కాకముందే పార్లమెంట్లో చర్చకు పెట్టిందని, దీన్ని మైనార్టీ సంఘాలు బలంగా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ముస్లింల పక్షపాతి అని చెప్పుకునే ఆంధ్రా కూటమి నాయకులు సవరణ బిల్లుపై తమ వైఖరిని స్పష్టం చేయాలని, లేకుంటే కేంద్రంలో ఎన్డీయే మద్దతు ఉపసహరించుకుంటారా అని సవాల్ విసిరారు. సవరణలోని అంశాలపై ముస్లిం సంఘాలు ఆందోళన చెందుతున్నాయని, ఒక వేళ బిల్లు ఆమోదం తెలిపితే ముస్లింల మనుగడకే ప్రమాదమని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అబ్దుల్ సత్తార్, ఒంగోలు అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి పఠాన్ ఖాజావలి, ఆయూబ్, ఖలీల్, సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

బంగారు బాల్యానికి తోడ్పాటునిద్దాం



దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రచారం చేస్తున్న అధికారులు, సిబ్బంది

సంతనూతలపాడు: బంగారు బాల్యానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని మండల విద్యాశాఖాధికారి డీ వెంకారెడ్డి పేర్కొన్నారు. గురువారం గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు, ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులు, పిల్లల కోసం ప్రత్యేక పథకాలు అందిస్తున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తెలిపారు. జిల్లా లోక్ అదాలత్ స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్ డాక్టర్ నూకతోటి రవికుమార్ మాట్లాడుతూ దివ్యాంగుల కోసం ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న ఉపకార వేతనాల గురించి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ వెంకటేశ్వర్లు వివరించారు. కార్యక్రమంలో న్యాయసేవాధికారాసంస్థ పారా లీగల్ వాలంటీర్ పాటిబండ్ల సతీష్ , ఐసీడీఎస్ సూపర్వైజర్లు నాగలక్ష్మి రాధా, పీహెచ్ఎస్ వీరమ్మ, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారి కృష్ణ, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ

ఒంగోలు మెట్రో: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళ గురించి సినీ పాటల పోటీల కరపత్రం ఆవిష్కరించారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు ఆధ్వర్యంలో ప్రతినెల రెండో శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అందులో భాగంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి మహిళ గురించి సినీ పాటల పోటీలు ఏర్పాటు చేశామని సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు బేతంశెట్టి హరిబాబు, ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్, కోశాధికారి దేనువకొండ సుబ్బయ్య, సహాయ కార్యదర్శి ఏల్చూరి అనంతలక్ష్మి, సభ్యులు జి వెంకటరామయ్య, ఏ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జీవామృతంతో నేల సారవంతం

ఒంగోలు సిటీ: ప్రకృతి వ్యవసాయంలో జీవామృతం వలన నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి రాధా సింగమనేని పేర్కొన్నారు. ఒంగోలు రూరల్ మండలంని వలేటివారిపాలెం గ్రామంలో రైతు సాధికార సంస్థ విభాగంలో జీవామృతం తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన వల్లేటి రాంబాబు, శ్రీలక్ష్మీలు తమ పొలంలో 600 లీటర్ల జీవామృతం తయారు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవామృతం వలన మట్టిలో సూక్ష్మజీవుల పెరుగుదలతో నేల సారవంతం అవుతుందన్నారు. పంటకు పెట్టగా వేర్లు బలంగా పెరిగి మొక్కల ఎదుగుదల మెరుగవుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.